
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట



5

మంగళవారం 10 సెప్టెంబరు 2024

గొర్రెల మందపై
కుక్కల దాడి
● 15 జీవాలు మృతి
7

సింగూరు ప్రాజెక్టు
గేట్లు మూసివేత
● వరద తగ్గుముఖం
● ఇన్ ఫ్లో 13,335 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులు
7

శాశ్వత పరిష్కారం చూపిస్తాం

ముంపు కాలనీల ప్రజలు అధైర్యపడవద్దు

ఎర్రకుంట, చంద్రయ్యకుంట తూములను వెడల్పు చేస్తాం

వరద నీరు నిల్వకుండా చర్యలు

మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



సంగారెడ్డిలోని ఎర్రకుంట తూమును మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, సెప్టెంబరు 9: సంగారెడ్డిలోని వరద ప్రభావిత కాలనీల్లో మరోసారి ఈ పరిస్థితి తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. వరద ముంపునకు గురైన సంగారెడ్డిలోని శ్రీచక్రకాలనీ, రెవెన్యూకాలనీ, ఎర్రకుంట, చంద్రయ్యకుంట, రామచంద్రకాలనీల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. మోకాళ్ల లోతు వరద నీటిలోనే ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగ్గారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సి చర్యల గురించి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. ఎర్రకుంట, చంద్రయ్యకుంట తూముల్లో పూడిక తీయడంతోపాటు వెడల్పు చేయడం వల్ల వరద ముప్పును అధిగమించవచ్చని అధికారులు పేర్కొన్నారు. పలు కాలనీల ప్రజలు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. దీంతో, జగ్గారెడ్డితో కలిసి మంత్రి దామోదర్ ఎర్రకుంట కట్ట పైకెక్కి పరిశీలించారు. ప్రజలకు అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. వరద ముంపు నుంచి తప్పించడానికి అవసరమైన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.



వరద నీటిలోనే రెవెన్యూ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం


సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 9: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అర్జీదారుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారానికి ఎంతో మంది వస్తారని, వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యమని అధికారులకు తెలిపారు. అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలని ఆయన పేర్కొన్నారు. మొత్తం కలిపి 33 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఆలయ భూములను కాపాడండి

ధూళిమిట్ట : ధూళిమిట్ట మండలంలోని బెక్కల్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయ భూములను కాపాడాలని కోరు తూ ఆ గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దేవస్థానం ఆధీనంలో ఉన్న సర్వే నంబర్లు 289, 284 లోని దాదాపు 4.22ఎకరాల భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. తిరిగి ఆ భూమిని వెంటనే దేవస్థానానికి అప్పగించి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని కోరారు.






వినాయక నవరాత్రోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన మండపాల్లో బొజ్జ గణపయ్య విశేష పూజలందుకుంటున్నాడు. పటేల్‌పురలోని ఓ ఇంట్లో బుజ్జి గణపయ్యను 10, 20, 100, 200 రూపాయల నోట్లతో అలంకరించారు. మూడు రోజుల పాటు ఇళ్లల్లో ప్రతిష్ఠించి పూజించిన గణనాథులను నిమజ్జనానికి తరలిస్తున్నారు. గణపతి బప్పా మోరియా అంటూ గంగమ్మ ఒడికి చేరుస్తున్నారు.

- సిద్దిపేట కల్చరల్

రూ.34.55 కోట్లు విద్యుత్ బకాయిలు

● తడిసిమోపెడవుతున్న ప్రభుత్వ సంస్థల పెండింగ్ బిల్లులు

● ఉచిత విద్యుత్‌తో విద్యాశాఖకు తగ్గిన భారం



దుబ్బాక, సెప్టెంబరు 9 : సిద్దిపేట జిల్లాలో విద్యుత్‌శాఖకు ప్రభుత్వ సంస్థల నుంచి బకాయిలు తడిసి మోపడవుతున్నాయి. బిల్లులు సక్రమంగా చెల్లించలేదంటూ విద్యుత్‌శాఖ అనేక శాఖల కార్యాలయాలకు సర్వీసులను నిలిపివేసింది. ఆర్‌అండ్‌బీకి చెందిన దుబ్బాక అతిథి గృహంలో సుమారు రూ.1,17,450బిల్లులు బకాయి ఉండడంతో ఏడాది క్రితమే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో అతిథి గృహం అంధకారంలో మగ్గుతుంది. ఇది ఒక్కటే కాదు పలు శాఖల నుంచి విద్యుత్‌శాఖకు సుమారు రూ.34.55కోట్ల పైచిలుకు బకాయి పేరుకుపోయింది. ముఖ్యంగా పంచాయతీరాజ్‌శాఖ విద్యుత్ శాఖకు గుదిబండగా మారింది. ప్రతీ గ్రామపంచాయతీ నుంచి విద్యుత్ దీపాల నిర్వహణ, గ్రామపంచాయతీ భవనం, మంచినీటి సరఫరా, సింగిల్ ఫేజ్ మోటార్ల నిర్వహణకు నెలకు రూ.17.50లక్షల చొప్పున ఏడాదికి రూ.5.77కోట్ల బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు నిధులు సక్రమంగా అందకపోవడం, గ్రామాల్లో పన్నుల రూపేణ వచ్చే ఆదాయం అంతంత మాత్రంగా ఉండడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారుతుంది. పంచాయతీ కార్యదర్శులు నామమాత్రంగా బిల్లులు చెల్లిస్తూ సర్వీస్‌లు కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల రూ.5.77కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

ఇక ఆ తర్వాత మున్సిపల్‌శాఖకు చెందిన బిల్లులు రూ.5.11కోట్ల మేర ఉన్నాయి. సిద్దిపేట మున్సిపాలిటీలో రూ.1.55కోట్ల పైచిలుకు, గజ్వేల్‌లో రూ.1.07కోట్లు, దుబ్బాక రూ.81.47లక్షలు, చేర్యాలలో రూ. 57.74లక్షలు, హుస్నాబాద్‌లో రూ.38.1లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలు 34 ఉన్నాయి. వాటిలో ముందస్తుగా బిల్లులు చెల్లించిన శాఖలు ఏడు ఉన్నాయి, విద్యుత్‌శాఖనే వీరికి బకాయిపడింది. వాటిలో పశుసంవర్ధకశాఖ,కేంద్రప్రభుత్వ రంగసంస్థలు, బీసీ వెల్ఫేర్ సంస్థలు ముందస్తుగా బిల్లులు చెల్లించాయి.

1,107 విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, ఆవాస విద్యాలయాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడంతో జిల్లాలోని 1107 విద్యాసంస్థల సర్వీసులు ఉచిత విద్యుత్ పరిధిలోకి రానున్నాయి. ఫలితంగా జిల్లాలో వివిధ విద్యాసంస్థలకు సుమారు రూ.3కోట్ల వరకు లబ్ధి చేకూరనున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు

దేశ హితం కోసం పని చేసే పార్టీ బీజేపీ మాత్రమే

6లో..

● రాష్ట్రంలో గాడి తప్పిన రేవంత్‌రెడ్డి పాలన ● మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

అనుమతుల్లేవ్..!

● నెలకు పైగా భవన నిర్మాణాలకు లభించని మోక్షం

● పెండింగ్‌లో 109 దరఖాస్తులు

● మున్సిపల్ చుట్టూ తిరుగుతున్న యజమానులు

● పట్టించుకోని అధికారులు!!

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 9: ప్రజలకు అత్యంత సౌకర్యవంతంగా, సులభంగా, పారదర్శకంగా భవన నిర్మాణల కోసం టీఎస్ బీపాస్ ప్రారంభించామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. సిద్దిపేటలో నూతనంగా భవనం నిర్మించుకుందామని ఆశగా ఎదురుచూస్తున్న భూ యజమానులకు అనుమతులు లభించకపోవడం పెద్ద తలనొప్పిగా మారింది. సిద్దిపేట మున్సిపల్ పరిధిలో ఇల్లు నిర్మించుకుందామని 109 మంది దరఖాస్తు చేసుకుంటే, ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తుకు కూడా మోక్షం లభించడంలేదు. దరఖాస్తు చేసుకుని ఇప్పటికే నెల దాటింది. దీంతో దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం



టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తులు

నూతన భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ బీపాస్ వెబ్‌సైట్ ద్వారా యజమానులు దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోపు మున్సిపల్ అధికారులు అనుమతులిస్తారు. కానీ సిద్దిపేట మున్సిపాలిటీలో మాత్రం 30 రోజులు దాటినా కూడా నిర్మాణాలకు అనుమతి లభించడం లేదు. భవన నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న తరువాత నేరుగా ఆ దరఖాస్తును టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపర్‌వైజర్ పరిశీలించి, టౌన్ ప్లానింగ్ అధికారికి పంపిస్తారు. టౌన్ ప్లానింగ్ అధికారి పరిశీలించి దానిని కమిషనర్ లాగిన్‌లోకి పంపిన తర్వాత అట్టి దరఖాస్తుకు అనుమతించాలి. కానీ ఇవేమి పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని, గట్టిగా అడుగుదామంటే ఎక్కడ అనుమతినివ్వరోనని పలువురు భూ యజమానులు ఆరోపిస్తున్నారు.

కమిషనర్ వచ్చినా...

ఆగస్టులో ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపట్టడంతో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. దీంతో సిద్దిపేట మున్సిపల్‌లో గత కొన్ని రోజులుగా ఇన్‌చార్జి కమిషనర్‌తో పనులు జరిపించారు. ఇప్పుడు కొత్త కమిషనర్ వచ్చారు. అంతా సవ్యంగానే ఉన్నా.. నూతన భవనాల అనుమతి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దాదాపు 109 దరఖాస్తులను పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతుల కోసం దాదాపు నెల రోజులకు పైగా భూ యజమానులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. త్వరితగతిన పరిశీలించి అధికారులు అనుమతులు ఇవ్వాలని భూ యజమానులు కోరుతున్నారు.



జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లిలో నీటమునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో రాధిక

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

● జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 9: అధిక వర్షాల వల్ల నల రేగడి భూముల్లో సాగు చేసిన పత్తి పంటలో వర్షం నీరు నిలిచి వేర్లకు గాలి అందక మొక్కలు వాడిపోతున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక పేర్కొన్నారు. వీలైనంత త్వరగా చేలల్లో నిలిచిన నీటిని తొలగించుకోవాలని రైతులకు సూచించారు. అధిక వర్షాలకు పంటలకు తెగుళ్ల ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, వాటి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదలు తడిచేట్లు చూడాలన్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో 3,542 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 3,542 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లుగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అత్యధికంగా హుస్నాబాద్ డివిజన్‌లో పంట నష్టం వాటిల్లిందన్నారు. వరి 1762, పత్తి 1,407, మొక్కజొన్న 271 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు చెప్పారు. మరో 600 ఎకరాలలో ఇతర పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామని ఆమె తెలిపారు. పంట నష్టాన్ని గుర్తించడానికి జిల్లాలోని వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుల వారీగా వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పంట నష్టం జరిగిన రైతుల వివరాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా పంట నష్టాన్ని కొంతమేర తగ్గించవచ్చని ఆమె సూచించారు. రైతులు విధిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఆమె వెంట ఏవో వసంతరావు, ఏఈఓ ఖలీల్, రైతులు, పలువురు ఉన్నారు.

డయాలిసిస్ కేంద్రాన్ని సందర్శించిన నిమ్స్ వైద్యులు


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 9 : మెదక్ జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని నెఫ్రాలజీ నిమ్స్ వైద్య బృందం సోమవారం సందర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ సేవలు, పర్యవేక్షణ బాధ్యత నిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే అపెక్స్ సంస్థకు అప్పజెప్పారు. అందులో భాగంగా నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ భూషణ్‌రాజ్ ఆధ్వర్యంలో డయాలసిస్ రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో 69 మంది కిడ్నీ బాధితులు సేవలు పొందుతున్నారన్నారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్రాన్ని సందర్శించి రోగులను పరీక్షించి తగు సూచనలు చేశామన్నారు. నెలకోసారి ఈ బృందం ఇక్కడకు వచ్చి పరీక్షిస్తుందని అన్నారు. రోజు వారీగా ఇప్పటికే టెలీకాన్ఫరెన్స్ ద్వారా సేవలందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర ఇన్‌చార్జి అంతోల్ల సురేష్, ఇన్‌చార్జి నవీద్, ప్రశాంత్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్

హెచ్‌ఎండీఏ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, భూ-సర్వే నీటిపారుదల శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి సోమవారం అధికారులు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఏడీ సర్వేలాండ్ వినయ్ కుమార్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. -సిద్ధిపేట కలెక్టరేట్

దేశ హితం కోసం పని చేసే పార్టీ బీజేపీ మాత్రమే

- రాష్ట్రంలో గాడి తప్పిన రేవంత్‌రెడ్డి పాలన
- మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 9 : దేశ హితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ మాత్రమే అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుంచి నాయకుడి స్థాయికి ఎదగడం బీజేపీ పార్టీలో మాత్రమే సాధ్యమన్నారు. ఇతర పార్టీల తరహాలో బీజేపీలోనూ కుటుంబ రాజకీయాలు ఉండవన్నారు. ఇటీవల బీజేపీ సభ్యత్వంలోకి చాలా మంది న్యాయవాదులు వస్తున్నారని, ఇది మారుతున్న దేశ రాజకీయాలకు సంకేతం అన్నారు. సిద్దిపేట గడ్డ నుంచే మార్పు మొదలైందని, కొంతమంది నాయకులకు మొన్నటి ఎన్నికలు కనువిప్పు కలిగించాయన్నారు. మోదీ ప్రభుత్వంలో విద్యా రంగంలో సమూల మార్పులు తెస్తుందన్నారు. ఈ దేశ అవసరాల కోసం నూతన చట్టాలను తెచ్చామన్నారు. దేశ సంస్కృతిని కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు తుంగలో తొక్కాయన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ప్రతీ రంగాన్ని ప్రక్షాళన చేశారని తెలిపారు. ఎప్పుడు ఎవరు జైలుకి వెళతారో తెలియని పార్టీతో మాకు పొత్తు ఉండదన్నారు. రేవంత్ రెడ్డి పాలనా గాడి తప్పుతుందన్నారు. వినాయక చవితి వేడుకలు ప్రారంభమైతే కానిస్టేబుల్‌ను కూడా ట్రాన్స్‌ఫర్ చేయరు, కానీ సీపీలను మారుస్తున్నారని విమర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ తదితరులు ఉన్నారు.


చెల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

హైడ్రాలో నష్టపోయిన పేదలకు కోకాపేటలో ఇళ్లు కట్టించాలి

దుబ్బాక, సెప్టెంబరు9 : హైడ్రా ద్వారా నష్టపోయిన నిరుపేద బాధిత కుటుంబాలకు కోకాపేటలో 150 గజాల స్థలాన్ని కేటాయించి, ఇళ్లను కట్టించాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ వార్డులోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అన్ని జిల్లాల్లో అమలు చేస్తే, స్వాగతిస్తామన్నారు. 2వవార్డు కౌన్సిలర్ దేవలక్ష్మీ తండ్రి వారంరోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ కౌన్సిలర్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో 'క్రిప్టో' దందా

కాయిన్స్ పేరుతో వసూళ్లు?

శివ్వంపేట, సెప్టెంబర్ 9 : క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే డబ్బు రెట్టింపు అవుతుందని గ్రామాల్లోని అమాయకులకు వల వేస్తున్నారు. శివ్వంపేట మండల పరిధిలో ఇద్దరు యువకులు ఏజెంట్లుగా మారి అమాయక రైతులకు రెట్టింపు డబ్బు ఆశచూపి పెట్టుబడి పెట్టిస్తున్నారని తెలిసింది. 50 వేలు పెట్టుబడులు పెడితే డబ్బు మూడింతలు అవుతుందని, కరెన్సీ కాయిన్స్ వస్తాయని నమ్మబలుకుతున్నట్లు సమాచారం.నాలుగు, ఐదు గ్రామాల్లో రైతులతో పాటు ఇతరులు సుమారు రూ.కోటికిపైగా క్రిప్టో కరెన్సీలో ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఏజెంట్లుగా ఉన్న యువకులు ఇటీవల కొంతమందిని గోవా విహారయాత్రకు తీసుకెళ్లినట్లు సమాచారం.



ప్రమాదకరంగా నాయిని చెరువు


మండల కేంద్రమైన చౌటకూర్ శివారులోని నాయిని చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళను సంతరించుకోగా చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. చెరువు కట్ట నాసిరకంగా ఉండడంతో ఎప్పుడు గండిపడుతుందోనని రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎక్సకవేటర్‌తో నాసిరకంగా మారిన ఆనకట్టపై మట్టి పోస్తూ మరమ్మతులు చేపడుతున్నారు. అయితే, పొలాలకు వెళ్లేందుకు స్థానిక రైతులు చెరువు అలుగుపై నుంచి మట్టి, కంకర పోసి దారిని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అలుగు ఎత్తు పెరిగింది. నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో కట్ట మరింత ప్రమాపుటంచుల్లోకి చేరింది. - పుల్‌కల్

వక్ఫ్ భూబాధిత రైతులను ఆదుకోవాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి
- రైతు హక్కుల సాధన సమితి జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి


జహీరాబాద్, సెప్టెంబరు 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వక్ఫ్ భూబాధిత రైతులను ఆదుకోవాలని రైతుహక్కుల సాధన సమితి జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 19 వేల పైచిలుకు ఎకరాల రైతుల వ్యవసాయ భూమిని వక్ఫ్‌భూమి అంటూ ప్రభుత్వాలు గుర్తించడమేంటని ఆయన ప్రశ్నించారు. తాతల, ముత్తాతల కాలం నుంచి ఈ భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు వక్ఫ్ భూములంటూ చెప్పడంతో నివ్వెరపోతున్నారన్నారు. 2018 వరకు రైతుల పేరిట ఉన్న భూములున్నాయని, సాగులో సైతం ఉన్నారన్నారు. గతపాలకుల హయాంలో భూప్రక్షాళన పేరుతో రైతుల భూములను వక్ఫ్‌భూములుగా గుర్తించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ భూములు రైతులవా లేక వక్ఫ్‌కు చెందినవా.. సందిగ్ధంలో పెట్టి రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆయా భూములకు రైతుల పేరు స్థానంలో వక్ఫ్ అని వస్తుందన్నారు. 2018 నుంచి ఈ భూములకు రైతుబంధు రావడంలేదని, రుణ మాఫీ వర్తించడం లేదని, కొత్తగా రుణం తీసుకుందామంటే అవకాశం లేకుండా పోయిందని ఆయన వాపోయారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతుహక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుతో బాధిత రైతులకు న్యాయం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్ర జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలుగా ఉండడంతో తమకు న్యాయం జరుగుతుందని ధీమాను వ్యక్తం చేశారు. ఈనెల 11న ఎంపీ డీకే అరుణ జహీరాబాద్ పట్టణానికి వస్తున్నారన్నారు. వక్ఫ్ భూబాధిత రైతులందరూ తరలిరావాలని వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఈ సమావేశంలో రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, అన్వీరప్ప, బస్వరాజ్, జగన్నాథ్‌రెడ్డి, వీరారెడ్డి, ఖుర్షీద్‌మియా, మాణయ్య, రవీందర్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.


వక్ఫ్ బోర్డు రిలీజ్ చేసిన గెజిట్‌ను చూపుతున్న రైతు హక్కుల సాధన సమితి నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి













పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు సరైన పోషక ఆహారం లభించక అనేకమంది నేత్ర సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారికి బాసటగా నిలవాలన్న ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ముందస్తుగా బడి పిల్లల్లో దృష్టి లోపాలను గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు, శస్త్రచికిత్సలు చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నది. అందుకోసం కొన్ని రోజులుగా స్కూల్ ఐ స్ర్కీనింగ్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నది. వైద్య బృందాలు పాఠశాలల వద్దకే వెళ్లి విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నాయి.

ఐ స్ర్కీనింగ్

ప్రభుత్వ బడుల విద్యార్థులకు పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం

- పాఠశాలలకు వెళ్తున్న ఆర్‌బీఎస్‌కే బృందాలు
- దృష్టి లోపం ఉన్నవారికి త్వరలో కళ్లద్దాల పంపిణీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 : ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం) ద్వారా వైద్య బృందాలను రంగంలోకి దింపింది. గత నెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు నెలాఖరు వరకు కొనసాగనున్నది. జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షల స్ర్కీనింగ్ చురుకుగా సాగుతున్నది.

పాఠశాలలకే వెళ్లి..

ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది ఆర్‌బీఎస్‌కే బృందాలతో పాటు 12 మంది ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఇందులో పాల్గొంటున్నారు. జిల్లాలో సుమారు 61 వేల మంది విద్యార్థులుండగా, ఇప్పటివరకు 23,747 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అందులో బాలురు 12129 మంది ఉండగా, బాలికలు 11618 మంది ఉన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం పాఠశాలలకే వెళ్లి పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో బృందం రోజుకు 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నది..

బయటపడుతున్న కంటి సమస్యలు

అనేక మంది విద్యార్థుల్లో కంటి సమస్యలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 23,747 మంది పిల్లలకు కంటి పరీక్షలు జరపగా, 1055 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అందులో బాలురు 420, బాలికలు 635 మంది ఉన్నారు. వీరిలో దృష్టి లోపాలను సరిచేయడానికి త్వరలో కళ్లద్దాలను ఉచితంగా అందజేయనున్నారు.

విద్యార్థుల దృష్టి లోపాల నివారణకే..



పిల్లల్లో పౌష్టికాహారం లేమి, అతిగా ఫోన్లు వాడకం వల్లే దృష్టి లోపాలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాలో మూడు నెలల పాటు బడి పిల్లలకు కంటి పరీక్షలు చేయాలనే ఆదేశాలు వచ్చాయి. అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా స్కూల్ ఐ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. విద్యార్థుల దృష్టి లోపాల నివారణకే వైద్య, ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది.

-డా.శశాంక్‌దేశ్‌పాండే, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్



బడా గణేష్ చెంత నీలం మధు

ఖైరతాబాద్‌లోని వినాయకుడిని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు తొలగి ప్రజలు సంతోషంగా ఉండాలని ఈ సందర్భంగా గణనాథుడి కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

-సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9

ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి ఆర్థిక సాయం

- మినాజీపేటలో రెండు కుటుంబాలకు రూ.లక్ష అందజేత



వర్గల్, సెప్టెంబరు 9 : మండల పరిధిలోని మినాజీపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన రెండు కటుటుంబాలకు ప్రముఖ జ్యోతిష్యుడు పరంకుశం వేణుస్వామి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. విద్యుదాఘాతం తో మృంతి చెందిన నీల యాదగిరి కుటుంబ సభ్యులకు రూ. 50వేలు, అనారోగ్యంతో మృతి చెందిన కర్రె కృష్ణ కుటుంబ సభ్యులకు రూ. 50 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎంతో కొంత సాయం చేయడం బాధ్యతగా బావిస్తామన్నారు. ఆర్థిక సాయం చేసినందుకు వేణు స్వామికి మినాజీపేట మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు చిన్నారిని అప్పగిస్తున్న పోలీసులు

చేర్యాల, సెప్టెంబరు 9 : ఓ నాలుగేళ్ల చిన్నారి తప్పిపోగా, పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన సోమవారం చేర్యాల పట్టణంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన చెవిటి రాజు భార్య స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ప్రసవించింది. తన నాలుగేళ్ల కూతురు నిత్య శ్రీ ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటూ తప్పిపోయింది. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే సమీప వీధిలో చిన్నారి తప్పిపోయి రోదిస్తున్న విషయాన్ని స్థానికులు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయమై తండ్రి పోలీసులకు సమాచారం అందించడంతో సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పాపను జాడను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

డివైడర్ మధ్యలో నిలిచిన భారీ వాహనం

- రాజీవ్ రహదారి ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్



కొండపాక, సెప్టెంబరు 9 : భారీ వాహనం దుద్దెడ శివారులో యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ మధ్యలో నిలిచిపోయింది. దాంతో రాజీవ్ రహదారిపై ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న భారీ లారీ బందారం వెళ్లేందుకు దుద్దెడ దాటిన తర్వాత యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ పైకి వెళ్లి టైర్లు ఇరుక్కపోయి నిలిచిపోయింది. రెండు వైపులా రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిచిపోవడంతో రాజీవ్ రహదారిపై వెళ్తున్న వాహనాలు ఎక్కడికక్కడే రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. టోల్ ప్లాజా వారికి సమాచారం ఇవ్వడంతో కంటైనర్ తెచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించారు.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి



వాహనాల తనఖీల్లో పట్టుకున్న అక్రమ మద్యం

జహీరాబాద్, సెప్టెంబరు 9 : గోవా నుంచి హైదరాబాద్‌కు టూరిస్టు బస్సుల్లో అక్రమంగా తీసుకువస్తున్న 7లీటర్ల పైచిలుకు గోవా మద్యం పట్టుకున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలు చేపడుతుండగా గోవా మద్యం తరలిస్తూ కొంతమంది పట్టుబడ్డారన్నారు. ఈ తనిఖీల్లో చెక్‌పోస్టు సీఐ లక్ష్మణ్‌సింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టు గేట్లు మూసివేత

- వరద తగ్గుముఖం
- జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగింపు
- ఇన్ ఫ్లో 13,335 క్యూసెక్కులు.. అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులు
- 29.917 టీఎంసీలకు 28.885 టీఎంసీలు నిల్వ

పుల్‌కల్, సెప్టెంబరు 9: సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పడుతున్నది. గడిచిన వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద నీటి ప్రవాహం పోటెత్తడంతో గరిష్ఠ నీటి మట్టానికి చేరుకున్నది. దీంతో ఈ నెల 5వ తేదీన రెండు గేట్లను ఎత్తి వరద జలాలను ఐదు రోజుల పాటు దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి క్రమంగా నీటి ప్రవాహం తగ్గుతుండటంతో ఒక్కో గేటును మూసేస్తూ వచ్చారు. అయితే, సోమవారం ఉదయం నాటికి వరద నీటి ప్రవాహం మరింతగా తగ్గడంతో ఎత్తి ఉన్న మరో గేటును కూడా మూసివేసినట్లు ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 13,335 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులుగా నమోదైంది. ఇందులో జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,842 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కాగా, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. అయితే, ప్రస్తుతం 523.420 మీటర్లకు 28.885 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.



జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని టర్బయిన్లు

1.5 మిలియన్ యూనిట్లు జల విద్యుత్

ఈ నెల 5 నుంచి సోమవారం వరకు 1.5 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అయిందని జెన్‌కో ఏడీఈ పాండయ్య తెలిపారు. 7.5 జల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బయిన్లు చురుకుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట ప్రాంతాల్లోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు సరఫరా జరుగుతుందన్నారు. ఇదిలావుండగా మంజీర రిజర్వాయర్ వద్ద రెండు గేట్లను మూసివేశారు. 2వ నంబరు గేటును మీటరు ఎత్తు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 9: తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరవలేనివని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కాళోజీ 110వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణతో సన్మానింపబడిన కాళోజీ స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి నాగరాజుగౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత, సెక్రటరి సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో..

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 : సంగారెడ్డిలో తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో డీఆర్వో పద్మజ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనేష్, కలెక్టరేట్ ఏవో పరమేశ్, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, ఉపాధ్యక్షుడు మోహన్, మైనార్టీ కార్యదర్శి అజీమ్, సురేశ్, శేఖర్ పాల్గొన్నారు. అలాగే తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో పద్మజ

టీఎన్‌జీవో భవన్‌లో..

మెదక్ కల్చరల్, సెప్టెంబర్ 9: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, కవులు అంజన్న, ఇక్బాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 15 జీవాలు మృతి
- బాధితులకు మాజీ మంత్రి హరీష్‌రావు ఆర్థికసాయం

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 9: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 15 గొర్రెలు మృతి చెందగా 10 గొర్రెలకు తీవ్రగాయాలైన సంఘటన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల్లి ఎల్లయ్య, గుండెల్లి కోమురయ్యలు రోజు మాదిరిగానే గొర్రెలను సాముహిక గొర్రెల షెడ్లలో తోలి ఇంటికి వచ్చారు. ఉదయం వెళ్లి చూడగా గొర్రెల మందపై కుక్కలు దాడి చేసినట్లు గమనించారు. అప్పటికే 15 గొర్రెలు మృతి చెందగా గాయపడ్డవాటికి పశువైద్యాధికారి శ్రవణ్ కుమార్ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తక్షణ సహాయం కింద పంపించిన రూ.10 వేలను బీఆర్ఎస్ జిల్లా నాయకులు కుంభాల ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏల్లయ్య, మాజీ ప్రజాప్రతినిధులు పర్శ రాములు, ఆంజనేయులు, బాల్ రెడ్డి, భాను చందర్ బాధితులకు అందజేశారు.



మాజీ మంత్రి హరీష్‌రావు పంపించిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్న నేతలు

వాగును కబ్జా చేసి.. హైవేను ముంచేశారు



నాగ్సాన్‌పల్లి శివారులో నల్లవాగును కబ్జాచేసి వాగును కుదించిన ఓ వెంచర్ యాజమాన్యం

- 65వ నంబర్ జాతీయ రహదారిపైకి వరద
- గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం
- హైడ్రా చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

సదాశివపేట, సెప్టెంబరు 9: వాగుతో పాటు వరద నీటి కాలువలను కబ్జా చేసి, ప్రవాహాన్ని దారి మళ్లించి ఏకంగా 65వ నంబర్ జాతీయ రహదారిని ముంచేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పెద్దాపూర్, నాగ్సాన్‌పల్లి గ్రామాల వద్ద ఓ ప్రముఖ వెంచర్ యాజమాన్యం వెంచర్‌లో నుంచి వెళ్తున్న నల్ల వాగును ఆక్రమించి వాగు వెడల్పును తగ్గించగా జాతీయ రహదారి పక్కనే కొత్తగా వెలసిన ఓ ప్రముఖ హోటల్ యాజమాన్యం హోటల్ మధ్య భాగం నుంచి వెళ్తున్న వాగు వరద నీటి కాలువలను కబ్జా చేసి దారి మళ్లించారు. ఈ రెండు వ్యాపార సంస్థల వ్యవహారంతో ఈ నెల 7వ తేదీన కురిసిన భారీ వర్షానికి జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. వాగును ఇష్టారీతిన కుదించడం, మలుపులు తిప్పడంతో భారీ వర్షాలతో వరద నీరు సజావుగా వెళ్లేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షం నీరంతా జాతీయ రహదారిపైకి చేరి ట్రాఫిక్ జామ్‌కు కారణమైంది. వరద తీవ్రతతో చిన్న వాహనాలు పూర్తిగా నీట మునిగిపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. విషయం తెలుసుకున్న సదాశివపేట సీఐ మహేష్ గౌడ్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, నేషనల్ హైవే శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది హుటాహుటినా పెద్దపూర్‌కు వద్దకు చేరుకుని వరదలో చిక్కుకుపోయిన వాహనాలను ఎక్స్‌కవేటర్ల సహాయంతో పక్కకు లాగారు. జాతీయ రహదారిపై రాకపోకలు సజావుగా సాగేందుకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఓ ప్రముఖ హోటల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నల్లవాగు కాలువ కనిపించకుండా నిర్మించిన భారీ సిమెంట్ స్లాబ్‌లను, నల్ల వాగు కాలువలో అనాధికారికంగా ఏర్పాటు చేసిన సీసీ పైపులను, కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ కప్పులను పగలగొట్టి జాతీయ రహదారిపై వరద నీటి ప్రవాహాన్ని మళ్లించారు.

రైతులు, గ్రామస్థుల ఆగ్రహం

ఇంత జరిగినా... సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. వెంచర్ కోసం దాదాపు 30 మీటర్ల వెడల్పుతో ఉన్న నల్లవాగును ఏకంగా ఐదు మీటర్లకే పరిమితం చేసిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. హోటల్ నిర్వాహకులు నల్లవాగు కాలువను మూసివేయడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయకుండానే ఉన్నతాధికారులు వెంచర్లు, విల్లాలు, హోటళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



నల్లవాగు కాలువపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సీసీ స్లాబ్ తొలగింపు..

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి



పోచయ్య(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 9 : విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం రాజిపేట గ్రామానికి చెందిన దాసరి పోచయ్య(65) పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం విధుల్లో భాగంగా స్థానిక గణేష్ మండపం వద్ద ఊడుస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే కిందపడి ఉన్న మండపానికి తీసిన కరెంట్ వైరు అతని కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కోడలు మౌనిక ఫిర్యాదుతో కేసు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎసై సత్యనారాయణ తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నవీన్‌కుమార్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 6 : ఓ వ్యక్తి నీటి గుంతలో పడి మృతి చెందినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ప్రకాష్ (28) అనే వ్యక్తి పోతిరెడ్డిపల్లిలో గణపతి విగ్రహాలు తయారు చేస్తూ జీవించేవాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటికెళ్లిన అతను తిరిగిరాలేదు. సోమవారం ఉదయం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శిల్పా వెంచర్ ఎదుటగల కాలనీలో ఓ నీటి గుంతలో మృతి చెంది కనిపించాడు. ప్రకాష్ మృతికి గల కారణాలు తెలియరాలేదని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరు దుర్మరణం

పాపన్నపేట, సెప్టెంబరు 9: కారు, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పాపన్న పేట మండల పరిధిలోని ఎల్లాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హవేలీ ఘనపూర్ మండలం చౌట్లపల్లి గ్రామానికి చీమల గణేష్(28) ప్రైవేటు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మీనగర్ ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఏడుపాయల కమాన్ వైపు నుంచి మెదక్ వెళుతున్న కారు ఎల్లాపూర్ శివారులో ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో కిందపడిన గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ..

ధూళిమిట్ట, సెప్టెంబరు 9: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని హనుమతండా గ్రామానికి చెందిన బానోత్ కిషన్ మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో ఇంట్లో చిన్న చిన్న గోడవలు జరగుతుండేవి. ఆదివారం కుడా బానోత్ కిషన్ మద్యం తాగి రావడంతో ఇంట్లో చిన్న గోడవ జరిగింది. మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఏజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పోందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మద్దూర్ ఎస్సై మహబూబ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెజ్జంకి, సెప్టెంబరు 9: మండలంలోని తలారివానిపల్లి గ్రామ శివారులో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగు పడి ఎద్దు మృతి



అక్కన్నపేట, సెప్టెంబరు 9: అక్కన్నపేట మండలం గొల్లపల్లిలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి గుడాల మల్లయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. రైతు మల్లయ్యను ప్రభుత్వం ఆదుకోవాని మాజీ సర్పంచ్ గుడాల సంపత్ యాదవ్ కోరారు.

దొంగేమో అనుకుని.. చావబాదారు..!

- గుర్తుతెలియని వ్యక్తి మృతి.. ఇద్దరి అరెస్టు



హత్య కేసు నిందితులు

తూప్రాన్, సెప్టెంబరు 9: ఊర్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తిని దొంగగా అనుమానించారు. అతడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడు మృతిచెందగా, అందుకు కారణమైన ఇద్దరిని గుర్తించి పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ సర్కిల్ పరిధి శివ్వంపేట మండలం గోమారంలో చోటు చేసుకున్నది. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో పదిహేను రోజులుగా మతిస్థిమితంలేని ఒకరు ఊర్లో భిక్షాటన చేసుకుంటు జీవిస్తున్నాడు. ఈనెల 4న రాత్రి గ్రామానికి చెందిన గంగిరెడ్డి తిరుపతిరెడ్డి(26), పందిముక్కల మణికంఠగౌడ్(28) మతిస్థిమితం లేని వ్యక్తిని చోరికి వచ్చినట్లు అనుమానించి దాడి చేసి గాయపర్చారు. ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి చితక బాదారు. దాడితో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ ఆధ్వర్యంలో శివ్వంపేట ఎస్ఐ మహేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఇద్దరి దాడిలో హత్యకుగురైనట్లు గుర్తించినట్లు వివరించారు. సోమవారం నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమం వైపు నడిపిన వ్యక్తి కాళోజీ

ప్రజలను ఉద్యమం వైపు నడిపిన వ్యక్తి కాళోజీ అని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


కొండపాక: బాలికల పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈవో


సిద్దిపేట కల్చరల్: డిగ్రీ కళాశాల కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


కోహెడ: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్


దుబ్బాక: డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్

మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలి: మున్సిపల్ కమిషనర్


బాలసదనం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఆశిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 9: మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించారు. పట్టణంలోని 28వ వార్డులో మురుగు కాలువ పక్కనున్న పిచ్చి మొక్కలు, కాలువ పైభాగానున్న మట్టిని తొలగించాలని ఆదేశించారు. గృహాల వద్దనున్న మట్టి, రాళ్ల కుప్పలను తొలగించాలని లేదంటే పాములు, విష కీటకాలు, దోమలు వాటిని ఆవాసం చేసుకుంటాయని, వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. బాలసదనంలో వర్షపు నీరు ఉండడాన్ని గమనించి వెంటనే నీరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. అవస్థల్లో ప్రజలు

- ఎటు చూసినా బురదమయం
- మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారుల వేడుకోలు

రాయపోల్, సెప్టెంబరు 9: రాయపోల్ పెద్దమ్మ గుడి నుంచి తిర్మలాపూర్ వరకు వేసిన మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారి పొలాన్ని తలపిస్తున్నది. దీంతో ఈ దారి వెంట వెళ్లేవారు నానా తంటాలు పడుతున్నారు. రోడ్డు మరమ్మతు కోసం ఏడాది క్రితం నిధులు మంజూరైనా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది. పన్నెండేళ్ల క్రితం రాయపోల్ నుంచి తిర్మలాపూర్, గొల్లపల్లి రహదారికి కలసే విధంగా సుమారు నాలుగు కిలోమీటర్ల మేరా మట్టి రోడ్డు వేశారు. మట్టి రోడ్డు తారు రోడ్డుగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆశించారు. కానీ మట్టిరోడ్డు వేసి దశాబ్దం దాటినా వర్షాలకు ఏర్పాడిన గుంతల్లో కనీసం మట్టి కూడా పోయలేదు. దీంతో ప్రతీ ఏడాది వర్షాకాలంలో రోడ్డంతా గుంతలతో పాటు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది.

ఏడాది క్రితం నిధులు మంజూరు

రాయపోల్ పెద్దమ్మ గుడి నుంచి తిర్మలాపూర్ రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితం రూ. 3 కోట్ల నిధులు


కుకునూరుపల్లి:అధ్వానంగా రాంచంద్రాపూర్ రోడ్డు

మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేస్తూ ప్రభుత్వం అప్పుడే ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా.. రోడ్డు నిర్మాణ పనులకు ఇంతవరకు టెండర్లు పూర్తి కాలేదని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు ఛిద్రం.. వాహనదారులు జరభద్రం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని ఏ రోడ్డు చూసినా గుంతలే. లకుడారం, మాత్‌పల్లి, రామచంద్రాపూర్, బొబ్బాయిపల్లి, మంగోల్, రామచంద్రాపూర్, మెదినీపూర్ ఇలా పలు గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారి నరకానికి దారులుగా మారాయి. రాజీవ్ రహదారి నుంచి లకుడారం, కుకు


బురదయంగా రాయపోల్-తిర్మలాపూర్ రోడ్డు

నూరుపల్లి నుంచి బొబ్బాయిపల్లికి వెళ్లే రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రాజీవ్ రహదారి నుంచి లకుడారంకు వెళ్లే రోడ్డు నాలుగు సంవత్సరాలుగా అటు రైల్వే ఇటు మిషన్ భగీరథ భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో పూర్తిగా ధ్వసమైంది. కుకునూరుపల్లి నుంచి బొబ్బాయిపల్లికి వెళ్లే రోడ్డుకి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిధుల లేమితో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టలేదు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల పదవీకాలం ముగియడంతో నాయకులు ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం.
- తిరుపతిరెడ్డి, పీఆర్ఏఈ

ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడి మృతి


రాజిరెడ్డి (ఫైల్)

బెజ్జంకి, సెప్టెంబరు 9: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన మండలంలోని గాగిల్లాపూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్ధం రాజిరెడ్డి (75) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజిరెడ్డి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో చేరికలు


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ

రాయపోల్, సెప్టెంబరు 9: రాయపోల్‌కు చెందిన అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకుడు ఇప్ప వెంకట్ సోమవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వెంకట్‌తో పాటు దేవేందర్, బాలరాజ్, బాలాచారి, మామిండ్ల పవన్ బీజేపీలో చేరారు. ఎంపీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశం కోసం చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్. రాజాగౌడ్, నాయకులు అహ్మదీపురం రాజు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం

చేర్యాల, సెప్టెంబరు 9: చేర్యాల మండలం చుంచనకోట నుంచి వీరన్నపేట వరకు 3కిలోమీటర్ల దెబ్బతిన్న మట్టిరోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయాధికారులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పార్టీ మండల కమిటీసభ్యుడు గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ చాలాయేండ్ల క్రితం రెండు గ్రామాల మధ్య మట్టిరోడ్డు దెబ్బతిన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రయాణీకులు ఇబ్బంది లుపడుతున్నారని, వెంటనే మరమ్మత్తులు చేపట్టి ఆర్టీసీ బస్సుసౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పండుగ యాదగిరి, వెంకటయ్య, మహేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం ముసుగులో బెదిరింపులకు పాల్పడితే సహించబోం

- జిల్లా జర్నలిస్టు సంఘం, సిద్దిపేట ప్రెస్‌క్లబ్

సిద్దిపేట కలెక్టరేట్ సెప్టెంబరు 09: జర్నలిజం ముసుగులో బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ), సిద్దిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి హెచ్చరించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా జర్నలిస్టు నాయకులు సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో కొందరు జర్నలిజం ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలను తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. జర్నలిజం ముసుగులో బెదిరింపులకు పాల్పడే వ్యక్తులు, సంస్థల పట్ల ఎవరైనా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ఆయన తెలిపారు. బెదిరింపులకు పాల్పడే వారి సమాచారాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ లేదా జర్నలిస్ట్ సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం'


కోహెడ: పోషక విలువల గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కొండ పాక / కోహెడ, సెప్టెంబరు 9: పిల్లలకు పోషకాహారం ఇస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని మర్పడగ అంగన్‌వాడీ టీచర్ రాణి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రఫత్ సుల్తాన, పంచాయతీ కార్యదర్శి వైద్య సిబ్బంది, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

కోహెడ మండలంలోని పోరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల తల్లులకు అంగన్‌వాడీలో ఇచ్చే పాలు, గుడ్లు, ఆకుకూరల పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హేమలత, పీఎస్ హెచ్ఎం చారి, టీచర్ కవిత, ఆశా కార్యకర్త, చిన్నారుల తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

కోహెడ మండల విశ్వకర్మ సంఘం కమిటీ ఎన్నిక

కోహెడ, సెప్టెంబరు 9: మండల కేంద్రంలో విశ్వకర్మ మండల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జిల్లా అధ్యక్షుడు నరసింహచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ పరిశీలకులుగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా రేపోజు సదానందంచారి, అధ్యక్షుడిగా గూడూరి రవీందర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా రేపోజు శంకర్, ఉపాధ్యక్షులుగా పుల్లూరి నవీన్‌కుమార్, మిట్టపల్లి జనార్దన్‌చారి, కోశాధికారిగా తిప్పారపు నాగరాజు, సహాయక కార్యదర్శిగా ఎర్రోజు విష్ణుచారి, అధికార ప్రతినిధిగా పెందోట ప్రభాకరచారి, ముఖ్య సలహాదారులుగా పెందోట విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు రేపోజు రాజమౌళి, మహేందర్ వనపర్తి మల్లేశం, సత్యం, శ్రీనివాస్, ఉల్లేంగల లింగాచారి, లక్ష్మీనారాయణ నరేష్, రాములు, నరసింహస్వామి, రాజలింగం, శ్రీనివాస్, రవీంద్రచారి, గోపాల్‌చారి, మహేంద్రచారి, నరసింహచారి, వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు ఉన్నారు

నర్మెట్ట గ్రామ పద్మశాలి సంఘం..

నంగునూరు, సెప్టెంబరు 9: ఐక్యతతోనే పద్మశాలీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంఘం నూతన అధ్యక్షుడు తాళ్ల మల్లేశం అన్నారు. మండలంలోని నర్మెట్ట గ్రామా పద్మశాలి సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా తాళ్ల మల్లేశం, ఉపాధ్యక్షులుగా గంగిశెట్టి శ్రీనివాస్, తాళ్లమనెవ్వ, ప్రధాన కార్యదర్శి గాతాళ్ల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా తాళ్ల నర్సయ్య, కార్యదర్శిగా సాదుల బాలేశం, గౌరవ సలహా మండలి సభ్యులుగా వడ్లకొండ నాగభూషణం, తాళ్ల బాల్ దుర్గయ్య, కార్యవర్గ సభ్యులుగా కుచన్ విక్రం, గంగిశెట్టి వేణు, తాళ్ల కరుణ, కొంక బాలరాజు, బొజ్జ శంకరయ్య, సాదుల లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు తాళ్ల సత్యనారాయణ, తాళ్ల చక్రపాణి, తాళ్ల మార్కండేయ, పుట్ట భాస్కరు, కొంక బాలరాజు తదితరులు పాల్గొన్నారు

మూడోదశ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

- కుదురుపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ

కుకునూరుపల్లి, సెప్టెంబరు 9: ఐటీఐ కళాశాలలో వివిధ విభాగాల్లో మిగిలిన సీట్లకు చివరి దశ అడ్మిషన్‌ల ప్రక్రియను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి దశ అడ్మిషన్‌లు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని, పదోతరగతి పాసైన వారందరూ అర్హులన్నారు. నేరుగా ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల, సెప్టెంబరు 9: సిద్దిపేట జిల్లాలోని సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5-9వతరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 12వతేదీన మిట్టపల్లి గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా డీసీవో బి.అశోక్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణప్రాంతాలకు చెంది వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందినవారు రూ.2లక్షలోపు ఆదాయం కలిగి ఉండాలని, గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పాస్ అయినవారే కాకుండా హాజరైన వారు, హాజరుకానివారితో పాటు అర్బన్, సెమిఅర్బన్ అంగవైకల్యం కలిగిన వారు అర్హులని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 86868 80320 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థిని చదువుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి సహాయం

చేర్యాల, సెప్టెంబరు 9: చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన ఓ విద్యార్థి చదువుకు ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ భరోసా కల్పించారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బుచ్చెల్లి అమృత ఇటీవల తండ్రిని కోల్పోయింది. కుటుంబపరిస్థితుల దృష్ట్యా ఆమెను తన వ్యక్తిగత ఖర్చులతో ఉన్నత చదువు చదివించనున్నట్లు ఉపాధ్యాయుడు పేర్కొన్నాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ఇంగ్లిష్ భాషలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు స్టేషనరీ, ప్యాడ్స్ విరాళంగా అందించగా, హెచ్ఎం అయిలయ్య చేతులమీదుగా పంపిణీ చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ములుగు, సెప్టెంబరు 9: అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పరామర్శించారు. మండల కేంద్రమైన ములుగుకు చెందిన బుడిగె రాజమ్మకు మృతి చెందిన విషయం తెలుసుకుని కుటుంబసభ్యులను పరామర్శించి ఆమె కమారుడు నాగరాజుకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట లక్ష్మణ్, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటాం

వర్గల్, సెప్టెంబరు9: ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని జిల్లా యూత్ కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో సోమవారం కాంగ్రెస్ కార్యకర్త కేశబోయిన బాలయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం రూ. 4000 నగదును అందజేశారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు పిట్ల రాజు, సల్మాన్, తిమ్మాపురం వెంకటేశ్, మహేష్ తదితరులు ఉన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌పై విద్యార్థులకు అవగాహన

మిరుదొడ్డి, సెప్టెంబరు 9: చైల్డ్ హెల్ప్‌లైన్‌పై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా సభ్యుడు బయికాడి లక్ష్మన్ సూచించారు. మిరుదొడ్డి ఆదర్శ పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్‌పై, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సహాయ వంటమనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి,సెప్టెంబరు9: మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సహాయవంట మనిషి పోస్ట్ ఖాళీగా ఉందని, మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

దూళిమిట్ట, సెప్టెంబరు 9: మండలంలోని దూళిమిట్ట, బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాల్లోని విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సింగిల్ ఫేస్, త్రీఫేస్ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింస్తునందున్న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

లంబోదరుడికి లక్ష పుష్పార్చన


లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న భక్తులు

చేర్యాల, సెప్టెంబరు 9: వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం లక్షపుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిప్రపత్తులతో వినాయకుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రకరకాల పూలతో అర్చన చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 9: జగదేవ్‌పూర్, మునిగడప గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారిని రాధిక ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను ఈపాస్ మిషన్‌లోని నిల్వలతో పోల్చి చూశారు. జిల్లాలోని ఎరువుల డీలర్లు అందరూ తప్పనిసరిగా ఈపాస్ మిషన్‌తో ఎరువుల అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఆమెవెంట మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఖలీల్ ఉన్నారు.

పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలి: ఏవో

రాయపోల్, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటల్లో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ సూచించారు. రాయపోల్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఏఈవో ప్రవీణ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 50 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని, నష్టం వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు.

నేలకూలిన ఇళ్ల జాబితా సిద్ధం

మద్దూరు, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన వర్షాలకు నేలకూలిన, శిథిలావస్థకు చేరిన ఇళ్ల జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ సోమవారం మాట్లాడారు. మండలంలోని లద్నూరులో-6, రేబర్తిలో-4, గాగిల్లాపూర్‌లో-2, సలాఖ్‌పూర్‌లో-1, వల్లంపట్లలో-4, మద్దూరులో-4 చొప్పున ఇళ్లుకూలినట్లు బాధితులు దరఖాస్తు చేసుకోగా సిబ్బందితో తనిఖీ చేయించి జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

దుబ్బాక,సెప్టెంబరు 9: రాష్ట్రంలో 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ పేర్కొన్నారు. దుబ్బాకలోని దుకాణాల్లో వరద బాధితుల కోసం సీఐటీయూ నాయకులతో కలిసి సోమవారం విరాళాలు సేకరించారు. వరదలకు నష్టపోయిన బాధిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే పంటనష్టపరిహారాన్ని అందించాన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, రాజు, మహేష్, అజయ్, నాగరాజు తదితరులున్నారు.

రైల్వే బ్రిడ్జి కింద తేలిన ఇనుప చువ్వలు


తేలిన ఇనుప చువ్వలు

గజ్వేల్, సెప్టెంబరు 9: గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డి పల్లి-గిరిపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు ధ్వంసమైంది. బ్రిడ్జి కింద గత సీసీ రోడ్డుపై పడిన గుంతలో ఇనుప చువ్వలు బయటకు తేలాయి. ఈ రోడ్డుపై గుంత పడడంతో ఇటీవల కురిసిన వర్షానికి భారీ వాహనాల రాకపోకలతో గుంత పెద్దదిగా మారి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. నిత్యం ద్విచక్రవాహనాలు, త్రిచక్ర వాహనాలు వందలాదిగా ఈ రోడ్డు మార్గం గుండా ప్రయాణిస్తుంటాయి. ఏదైనా ప్రమాదం జరుగక ముందే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీపీసీసీ నూతన అధ్యక్షుడిని కలిసిన నాయకులు


సిద్దిపేట టౌన్: పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 9: చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి సోమవారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జనగామ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై ముచ్చటించారు.

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 9: తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ నియామకమైన సందర్భంగా ఆయనను సోమవారం హైదరాబాద్‌లో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాలకు ఈ ఎంపికతో పెద్దపీట వేసిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సుప్రభాత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక, సెప్టెంబరు 9: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైనా మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛని అందజేశారు.

బైరాన్‌పల్లి శౌర్యయాత్రను జయప్రదం చేయండి : సీపీఎం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 9: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14న చేర్యాల నుంచి బైరాన్‌పల్లి వరకు చేపట్టనున్న శౌర్యయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శౌర్యయాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తికోసం నైజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ఎందరో అసువులు బాశారని, సాయుధ పోరాట అమరవీరుల పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తుండటం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు గొర్రె శ్రీనివాస్, దర్శనం రమేశ్, రాళ్ల బండి భాస్కర్, బోయిని మల్లేశం, పండుగ యాదగిరి, యాడారం బ్రహ్మయ్య , బావండ్లపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు

- చేర్యాల సీఐ శ్రీను


మద్దూరు: మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీను

మద్దూరు, సెప్టెంబరు 9: మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, గుర్తుతెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని చేర్యాల సీఐ శ్రీను సూచించారు. మహిళల రక్షణ చట్టాలతో పాటు సైబర్ నేరాలపై సోమవారం లద్నూరు ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావల గురించి వివరించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీం బృందం సైదయ్య, హెడ్ కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్ల కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

అభయ యాప్‌పై ఆటోడ్రైవర్లకు అవగాహన ఉండాలి

గజ్వేల్, సెప్టెంబరు 9: అభయ యాప్‌పై ఆటోడ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆటోడ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మహిళల రక్షణకు తీసుకువచ్చిన అభయ యాప్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలలో ప్రయాణించే మహిళల రక్షణకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఏఎ్ ఎఐ వెంకట్రామిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, సంతోష్ తదితరులున్నారు.


గజ్వేల్: ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీ

చేర్యాలలో నిరుపయోగంగా 'స్వచ్ఛ్ టాయిలెట్లు'

- రోడ్డు విస్తరణ పనులతో తొలగింపు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

చేర్యాల, సెప్టెంబరు 9: వివిధ పనుల నిమిత్తం చేర్యాల పట్టణానికి వచ్చిన ప్రజలు, ప్రయాణికుల ప్రయోజనార్థం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన స్వచ్ఛ్ టాయిలెట్లు నిరుపయోగండా మారాయి. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండడం, ప్రతీ మంగళవారం వారాంతపుసంత కొనసాగుతుండడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరత్రా పనులకు వస్తున్నా ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో లేక నానా తంటాలు పడుతున్నారు. గత ప్రభుత్వం రాష్టవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో స్వచ్ఛ టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణ, పోలీస్‌స్టేషన్ ఆవరణ, కుడిచెరువు కట్ట ఆవరణలో మూడేసి బయో టాయిలెట్లను నెలకొల్పారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్లాట్ ఫాం నిర్మించి నీటివసతి కల్పించారు. కానీ పట్టణంలో జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధానరహదారి విస్తరణ పనులలో భాగంగా డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టడంతో వాటిని కొన్ని నెలలక్రితం తొలగించారు. దీంతో వేలాది రూపాయలు మట్టిలో కలిసిపోగా, టాయిలెట్లను తొలగించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోని టాయిలెట్లను అంగడిబజారు సమీపంలోని వాటర్ ట్యాంక్ ఆవరణలో, ఎంపీడీవో కార్యాలయ ప్రహరీ ఆవరణలోని టాయిలెట్లను ఎదురుగా డ్రెయిన్‌పై వృధాగా నెలకొల్పారు. దీంతో ఎలాంటి రక్షణ లేకపోవడంతో దెబ్బతింటున్నాయి. ఆయా ప్రదేశాల్లో చాన్నాళ్ల క్రితమే డ్రైన్‌పనులు పూర్తి చేసినప్పటికీ మున్సిపల్ వర్గాలు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. తొలగించిన టాయిలెట్లను ఇప్పటికైనా నెలకొల్పి త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాల ప్రజలు కోరుతున్నారు.


ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా అస్తవ్యస్తంగా స్వచ్ఛ టాయిలెట్లు